# ఫారిన్ టూర్



"స్స స్స స్స" అన్న శబ్దం వినిపించింది నాకు నిద్రలో. ఆ శబ్దం ఏమిటో తెలుసుకోవాలన్న కుతూహలం కంటే నేను నిద్రని ఎక్కువగా ప్రేమించడం చేత లెక్క చేయకుండా నిద్ర తాలూకు మరో తెరలోకి జారిపోయాను.

ఆదివారం నాడు మా కాలనీవాళ్ళందరం నిద్రకు ఎంత ప్రాముఖ్యత ఇస్తామో మీకూ తెలుసు. ఎందుకంటే కొంతవరకూ మనుష్యుల్లాగా గడిపేది మేము ఆదివారం నిద్రలోనే! ఈసారి స్పష్టంగా వినిపించింది శాయిరాం. గొంతు.

"హలో! అర్జంట్! త్వరగా లే!"

"ఛటుక్కున కళ్ళు తెరచి చూశాను.

తెరచివున్న ఒకే ఒక్క కిటికీ రెక్కలో నుంచి చువ్వల బయట ఆనందంతో నవ్వుతూన్న శాయిరాం మొఖం కనిపించింది.

కొద్ది క్షణాలు నాకది కలో నిజమో తెలీలేదు. కలో నిజమో తెలుసుకోవాలంటే మా కాలనీ వాళ్ళు ఫాలో అయ్యే పద్ధతి ఒకటి వాడుకలో ఉంది.

సాధారణంగా అందరూ చేయిగిల్లుకుని పరీక్షించుకుంటారు గానీ మేమలా క్కాదు.

"నేను తెలుగువాడిని! నేను తెలుగురాష్ట్ర పౌరుడిని' అని రెండు సార్లనుకుంటే చాలు!

ఇంకా ఎందుకు బ్రతికి ఉన్నాను" అన్న ఫీలింగ్స్ వచ్చేస్తాయి.

దాంతో అది నిజమేననీ కలకాదనీ తెలిసిపోతుంది.

ఇప్పుడీ శాయిరామ్ వ్యవహారం కూడా కలో నిజమో తేల్చుకోడానికి అదే పద్ధతి ఉపయోగించాను.

"నేను తెలుగు పౌరుడిని! నేను తెలుగు పౌరుడిని! నేనున్నది ఆంధ్రప్రదేశ్‌లో" అని రెండుసార్లు అనుకునేసరికి ఏడుపొచ్చేసింది. వెచ్చగా కన్నీరు ప్రవహించింది. దాంతో అది కలకాదని ఋజువయిపోయింది.

"ఏమిటి?" కొంచెం కోపంగా అడిగాను పక్కమీద నుంచి లేవకుండానే.

"అర్జంట్ గురూ! త్వరగా పద! మనందరం ఫారిన్ టూర్ వెళుతున్నాం"

"ఫారిన్‌టూరా?" ఆశ్చర్యంగా అడిగాను.

"అవును బ్రదర్! ఫారిన్ టూర్! అద్భుతమయిన అవకాశం! త్వరగా లే" బాగా ఎగ్జయిటయిపోతూ అన్నాడతను.

నాకు అతనిని చూస్తే జాలేసింది.

శాయిరామ్‌కి చిన్నప్పట్నుంచీ విదేశాలు చూడాలని చాలా కోరికగా ఉండేదని అతనే చాలాసార్లు మాకు చెప్పాడు. తమాషా ఏమిటంటే మా లాంటి మిడిల్ క్లాస్ పక్షులకు అలాంటి కోరికలు ఉండకూడదని తెలిసినా రోజురోజుకీ అతని కోరిక బలపడింది కానీ తగ్గలేదు.

అతని యింటిలో టేబుల్ సొరుగు లాగి చూశారంటే లోపల బోలెడు పేపర్ కటింగ్స్ కనబడతాయి.

సింగపూర్ యాత్ర! రానూ బోనూ అరువేల రూపాయలు మాత్రమే... (హోటల్ సైట్ సీయింగ్ ఖర్చులతో సహా)

అని ఒక కటింగ్ ఉంటే.

"అతి చౌకగా సంపూర్ణ ప్రపంచయాత్ర! కేవలం అరవై వేల రూపాయలకే! లాడ్జింగ్, బోర్డింగ్ ఉచితం. వెంటనే ఈ సదవకాశాన్ని వినియోగించుకోండి!

వెంటనే ఫలానా ట్రావెల్స్‌ని సంప్రదించండి.

అని ఇంకో కటింగ్ ఉంటుంది.

"అబ్బ! ఇదే అయిదారు వందల రూపాయలయితే పి.ఎఫ్. అప్లయ్ చేసి దర్జాగా వెళ్ళి వచ్చేవాడిని" అంటూండేవాడు శాయిరామ్.

బహుశా ఇప్పుడు అలాంటి అవకాశం ఏదయినా వచ్చిందేమోననుకున్నాను.

"అంటే నేపాల్ బంగ్లాదేశ్ లాంటి ఫారిన్ దేశాలా?" అనుమానంగా అడిగాను.

"చఛ! ఫారిన్ గురూ! సింగపూర్, మలేషియా, అమెరికా, ఫ్రాన్స్ లాంటి దేశాలు."

హఠాత్తుగా నాకు శాయిరామ్ మీద జాలేసింది.

ఎందుకంటే మా కాలనీలోనే ఈస్ట్ సైడ్ బిల్డింగ్‌లో వుండే సత్యన్నారాయణ గుర్తుకొచ్చాడు నాకు.

అతనికి ఓ బలమయిన కోరిక ఉండేది.

అదేమిటంటే ఎలాగయినా ఎందుకూ పనికిరాని కేంద్ర ప్రభుత్వంలో ఉద్యోగం వదిలేసి ఏదయినా వ్యాపారం చేసుకుని ధనవంతుడవాలని! ఆ కోరిక అందరికీ చెపుతుండేవాడు. మేము 'హహహ' అని నవ్వి వూరుకునేవాళ్ళం.

కానీ అది మరింత బలపడి చివరకు ఓ రోజు మానసిక భ్రమలోకి దించింది. ఆరోజు ఉదయం నుంచే కాలనీ అంతా తిరిగి తను ఉద్యోగం మానేసి వ్యాపారం ప్రారంభించాననీ మొదటి రోజే లక్ష రూపాయలు లాభంవచ్చిందనీ చెప్పటం ప్రారంభించాడు. వాళ్ళావిడ లబోదిబోమని ఏడుస్తూ మాదగ్గరకొచ్చేసిరికి మేము అర్జంటుగా సమావేశం జరిపాము.

అతను మళ్ళీ మామూలు స్థితికి రావాలంటే మా కాలనీ వాళ్ళు కనిపెట్టిన "కంబళి పెరేడ్" చేయాలని రంగారెడ్డి సలహా ఇచ్చాడు.

కంబళి పెరేడ్ అంటే సడెన్‌గా మానసిక సమస్యలు వచ్చినవారిని గట్టిగా పట్టుకుని వాళ్ళ నెత్తిమీద కంబళి వేసి తర్వాత అందరం తలో టెంకిజెల్లా ఇచ్చి అప్పుడు అకస్మాత్తుగా నాలుగుబిందెల నీళ్ళు క్రుమ్మరించాలి.

దాంతో స్పృహలోకొచ్చి నార్మల్ అయిపోతాడతను.

అప్పుడు ఎర్రలారీ- తెల్లలారీ అంటూ పదిసార్లనిపిస్తేచాలు. ఇంక గొడవుండదు. ఆ కంబళి పెరేడ్ చేశాక వెంటనే మామూలు మనిషయిపోయాడు సత్యన్నారాయణ! కనుక ఇప్పుడు శాయిరామ్ వ్యవహారం చూస్తూంటే ఇతనిదీ అచ్చం అలాంటి కేసే అని తెలిసిపోయింది నాకు.

వెంటనే మా వాళ్లందరినీ పిలిపించి అప్పటికప్పుడు ప్రథమ చికిత్స ప్రారంభించ కపోతే శాయిరామ్ ఆ భ్రమలోంచి బయటపడలేడు.

ఎందుకయినా మంచిదని అతనిని మరోసారి టెస్ట్ చేశాను.

"కాని అలాంటి దూరదేశాలకు వెళ్ళాలంటే మాటలా?"

దాంతో శాయీరామ్ మరింత ఎగ్జటయిపోయాడు.

"నేను చెపుతున్నాను కదా! నేనొక్కడినే కాదు. మనందరం కూడా వెళ్తున్నాం. వచ్చే నెలలోనే వెళ్తున్నాం. రేపే మనం వెళ్ళి వీసాలు, పాస్‌పోర్ట్‌ల గొడవలన్నీ చూడాలి. సామాన్లు ఎంత తక్కువ వీలయితే అంత తక్కువ తీసుకెళ్ళాలట! పదగురూ త్వరగా."

నాకు అతని పరిస్థితి నిర్ధారణ అయిపోయింది.

"ఇప్పుడే వస్తా" అంటూ లోపలకు వెళ్ళి మా ఆవిడతో చెప్పేశాను.

"త్వరగా వెళ్ళి మా వాళ్ళందరినీ తీసుకురా! శాయిరామ్‌కి అర్జంటుగా కంబళి పెరేడ్ చేయాలని చెప్పు! 'ఫారిన్ టూర్' అంటూ పిచ్చిమాటలు మాట్లాడుతున్నాడు."

మా ఆవిడ గాబరాగా పరుగెత్తింది.

నేను బయటకొచ్చి శాయిరామ్‌తో సంభాషణ ప్రారంభించాను.

"ఉహూ! అయితే మనందరం కలిసి ఫారిన్ టూర్ వెళ్ళవచ్చన్నమాట" అన్నాను చాలా ఆసక్తి కనబరుస్తూ.

"అవును! చాలా ఈజీ అనుకో! ఇంతకాలం మనకీ సంగతి తెలీక ఫారిన్‌టూర్ అంటే అబ్బో- చాలా కష్టం అనుకున్నాం! ఎంత పిచ్చివాళ్లమో చూడు! అహ్హహ్హహ్హ"

"అవును భలే పిచ్చివాళ్ళం అహ్హహ్హహ్హహ్హ"

"ఇప్పటికయినా నేను చొరవ తీసుకోబట్టి గానీ లేకపోతే జీవితాంతం మనం ఫారిన్ వెళ్ళకుండానే ఉండిపోయేవాళ్ళం. ఎంత దారుణమో చూడు."

"చాలా దారుణం. ఫారిన్ వెళ్ళని బ్రతుకూ ఓ బ్రతుకేనా? ఇప్పటికయినా ఫారిన్ వెళుతున్నాం కనుక బ్రతికి పోయాంగానీ లేపోతే ఆ నిరాశ భరించలేక చచ్చేవాళ్ళం"

సరిగ్గా అప్పుడే రంగారెడ్డి, యాదగిరి, గోపాల్రావ్, జనార్ధన్, చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్ కంబళీ తీసుకొచ్చేశారు వెనుకనుంచీ.

కానీ తీరా కంబళి మీద వేయబోయే సమయానికి గమనించి గట్టిగా అరుస్తూ పక్కకు దూకేశాడు శాయిరామ్.

"ఏమిటిది? నాకేం పిచ్చెక్కిందనుకున్నారా?" అన్నాడు గాబరాగా.

వాళ్ళందరూ నావేపు చూశారు.

"పిచ్చి అంటే మరీ పిచ్చికాదు గానీ, కొంచెం దాని "జలక్" అన్నమాట!" అన్నాన్నేను.
అప్పటికే చుట్టుపక్కల ఆడాళ్ళందరూ బిందెలతో నీళ్ళు తీసుకొచ్చేశారు రెడీగా.

శాయిరాం మొఖం మాడిపోయింది.

"ఇదన్యాయం గురూ! సత్యన్నారాయణకు మెదడు కొంచెం చెదిరినప్పుడు ఈ కంబళి పెరేడ్ షాక్ ట్రీట్‌మెంట్ గురించి చెప్పింది నేనే! ఇప్పుడు దాన్ని నా మీదే ప్రయోగిస్తారా?" కోపంగా అడిగాడు.

"మరి నువ్ కూడా ఫారిన్ టూర్ వెళ్ళిపోతున్నాం" అంటూ పిచ్చి మాటలు మాట్లాడావంట కదా?" అన్నాడు రంగారెడ్డి బెదురుగా.

శాయిరామ్ నావంక చూసి "హు!" అన్నాడు.

"అయితే నేను ఇందాకట్నుంచీ మాట్లాడుతున్నదంతా పిచ్చెక్కి మాట్లాడుతున్నానని అనుకుంటున్నావన్నమాట"

"ఎగ్జాట్‌గా పిచ్చి అని కాదు గానీ మెదడు తాత్కాలికంగా చెదరటం లాంటిదని"

"హు!" అన్నాడు శాయిరాం మళ్ళీ. మాకు అతని మీద జాలివేసింది.

"అయితే ఇప్పుడు నార్మల్ అయిపోయినట్లే గదా! ఇంక 'ఫారిన్ టూర్' అనవు కదా!" అడిగాడు గోపాల్రావ్.

ఆ మాటతో మళ్ళీ కోపం వచ్చింది శాయిరాంకి.

"అరె! నిజంగానే చెప్తున్నా నయ్యా! మనందరం ఫారిన్‌టూర్ వెళ్ళేందుకు ఓ మాంచి ఛాన్స్ దొరికింది. ఇంకాసేపట్లో అతనొస్తున్నాడు మన కాలనీకి! మనందరం రెడీగా ఉంటే అతనిని వివరాలన్నీ అడిగి ఆ ఏర్పాటు చేసుకోవచ్చు."

అందరం ఒకరి మొఖాలొకరు చూసుకున్నాం.

"ఎవరతను?" అడిగాడు జనార్ధన్.

"బ్రోకర్"

"ఏం బ్రోకరు?"

"అదే గురూ! విదేశాలు చూడాలనుకునే వారందరికీ అక్కడి తెలుగువారి ఖర్చుమీద ఆ దేశాలు టూర్ చేసే ఏర్పాట్లు చేస్తాడు. ఇప్పటికి పదకొండు వందల మందిని బోలెడు దేశాలకు పంపించాడు."

మాకు శాయిరాం మాటలు వివరంగా తెలీటం లేదు.

"ఆ దేశాల్లోని తెలుగువాళ్లు ఎందుకు అంత డబ్బు ఖర్చుపెట్టి మన రాష్ట్రంలో వారందరినీ పిలిపిస్తున్నట్లు?"

శాయిరాం బుర్ర గోక్కున్నాడు. అతనికి ఆ పాయింట్ అర్థమయినట్లులేదు.

"ఇలాంటి దిక్కుమాలిన రాష్ట్రంలో ఉన్న మన తెలుగువాళ్ళందరి మొఖాలు ఓసారి చూడాలనిపించిందేమో" అన్నాడు అనుమానంగా.

మాకూ సరిగ్గా అదే అనుమానం వచ్చింది.

"అవునవును! ఇలాంటి కోరిక ప్రవాసాంధ్రులకు కలగటం చాలా సహజం" అన్నాడు రంగారెడ్డి కూడా వప్పుకుంటూ.

"ఇంతకూ బ్రోకర్‌కి డబ్బెవరిచ్చు కుంటారు?" అడిగాడు జనార్ధన్.

"ఇంకెవరిస్తారు? మనమే!"

"మన మెందుకిస్తాం?"

"మనం ఇవ్వకపోతే ఇచ్చేవాళ్ళను పంపిస్తాడు. విదేశాలు చూడాలనుకునే వాళ్ళు తక్కువయితే కదా!"

అందరం అప్పటికి సమావేశం విరమించాం.

బ్రోకర్ వచ్చాక తిరిగి కాలనీ వేదిక దగ్గర సమావేశమవాలని నిర్ణయించుకున్నాం.

సరిగ్గా పదకొండువుతూండగానే బయటనుంచి శాయిరామ్ కేకలు వినిపించేసినయ్.

నేను వెళ్ళేసరికే అందరూ ఓ అంబాసిడర్ కారు చుట్టూ మూగి ఉన్నారు. ఓ వ్యక్తి చాలా ఖరీదయిన దుస్తుల్లో కారు దిగి శాయిరాం ద్వారా అందరినీ పరిచయం చేసుకుంటున్నాడు.

"ఈయన చక్రధర్ గారు! జనాల్ని పోగుచేసి విదేశాలు పంపించటంలో ఈయనదే రికార్డ్ ఇంతవరకూ మొత్తం పదకొండొందల మందిని పంపారట" పరిచయం చేశాడు శాయిరాం.

అందరం సమస్కరించాం వినయంగా.

అతనిని వేదిక మధ్యలో కూర్చోబెట్టి అందరం చుట్టూ మూగాం.

"మీలో ఎంతమంది ఫారిన్ వెళ్ళాలనుకుంటున్నారు?" తన చేతిలోని ఫైల్స్ ఓపెన్ చేస్తూ అడిగాడు బ్రోకర్.

"మా కమిటీ మెంబర్స్ అందరం వెళ్ళాలనుకుంటున్నామండీ" అన్నాడు శాయిరాం బెరుగ్గా.

"అంటే ఎంతమంది?'

"మొత్తం ఎనిమిదిమందండీ."

ఆ మాటతో మా వెనుకే నిలబడ్డ రాజేశ్వరి, సావిత్రమ్మ గారూ, రజనీదేవి కయ్యిన లేచారు.

"కమిటీ మెంబర్సేనేమిటి? మేమూ ఫారిన్ వెళ్తాం! మేము మాత్రం ఎందుకెళ్ళకూడదు?" కోపంగా అంది రాజేశ్వరి.

బ్రోకర్ చిరునవ్వు నవ్వాడు.

"ఓ ఎవరయినా వెళ్ళవచ్చమ్మా ఎంతమందయినా వెళ్ళవచ్చు! ఏ దేశమయినా వెళ్ళవచ్చు! ఏం ప్రాబ్లెమ్ లేదు. కారుచౌకలో ఫారిన్ కంట్రీస్! మీ పేర్లు రాసివ్వండి! పేర్ల కెదురుగ్గా ఏ ఏ దేశాలు వెళ్ళానుకుంటోందీ కూడా రాయండి. ఏం ఫరవాలేదు. అందరికీ ఛాన్సిస్తాను. కారుచౌక! బ్రదర్స్ అండ్ సిస్టర్స్! ఏం మొహమాటపడకండి!"

అతని మాటలతో ఎక్సర్సయిజ్ నోట్ బుక్స్ నాలుగు కాలనీ వాళ్ళ పేర్లతో ఠకీమని నిండిపోయాయి.

బ్రోకర్ ఆ పేర్లన్నీ చూసుకుని ఆనందంగా నవ్వాడు.

"ఆహా! ఇలా ముందుకి రావాలి తెలుగు ప్రజలందరూ! చాలా గొప్ప అండర్‌స్టాండింగ్‌పవర్ ఉంది మీకు. సెభాష్! బ్రదర్స్ అండ్ సిస్టర్స్! అందర్నీ విదేశాలకు పంపించే పూచీ నాది."

"కానీ ఇన్ని వందలమందిని అంతఖర్చుతో ఫారిన్ కంట్రీస్‌కి ఎలా పంపించగలరు?" అనుమానంగా అడిగాడు శాయిరాం.

"చాలా మంచి ప్రశ్న బ్రదర్! కొంచెం ఆలస్యంగా అడిగావ్! అయినా ఫరవాలేదు!

ఇందులో మన ఖర్చేమీ ఉండదు! అంతా విదేశీ తెలుగువాళ్ళే భరిస్తారు. ప్రవాసాంధ్ర అసోసియేషన్స్ దగ్గర డబ్బు తెగ మూలుగుతోంది బ్రదర్స్ అండ్ సిస్టర్స్! అంచేత ఖర్చులన్నీ వాళ్ళవే! మనం చాలా నామినల్‌గా డబ్బు ఖర్చుచేయాలి. ఒకోసారి మనం ఖర్చుపెట్టిన కొద్ది మొత్తానికి కూడా నాలుగింతలు బహుమానాలు ఇస్తారు వాళ్ళు."

అందరికీ ఆశ ఎక్కువయిపోయింది.

"అయితే మేము ఎంత ఖర్చు పెట్టాలంటారు?"

"ఎంతో లేదు బ్రదర్! ముందు అందరూ తలో వందా నాకివ్వాలి. నేను ఆ డబ్బుతో విదేశీయాత్ర కెళ్ళవలసిన ఏర్పాట్లన్నీ చేస్తాను అప్పుడు ఒకవేపు విమానం టికెట్‌కి మాత్రం డబ్బు మీరే కట్టుకోవాలి! అదిగాక నాకు తలో వెయ్యి ఇస్తే చాలు. అద్భుత విదేశీయాత్ర!" ఊరిస్తూ చెప్పాడు.

మా గుండెల్లోరాయి పడినట్లయింది.

"మైగాడ్! అంత డబ్బే! అంత డబ్బు మా దగ్గరెక్కడిది?" గాబరాగా అడిగాడు రంగారెడ్డి.

అతను చిరునవ్వు నవ్వాడు.

"అలా కంగారుపడితే ఎలా బ్రదర్స్! ఒకవేళ ఆ మూడువేల రూపాయలు కూడా మీరు పెట్టుకోలేకపోతే స్కీం నెంబర్‌త్రీ ఉంది. అది ఫాలో అయిపోండి! నేను గైడ్ చేస్తాను.

"స్కీం నెంబర్ త్రీ అంటే ఏమిటండీ?" వినయంగా అడిగాడు గోపాల్రావ్.

"ఆ మాత్రం తెలీదా. మీ ఏరియాలో శంకర్‌దాదా శిష్యుడు గుడుంబా నర్సింహ లేడా? అతనిని స్కీం నెంబర్ త్రీ తోనే పంపించాను. సరే దాని సంగతి తర్వాత చెప్తాను ముందు మీ కమిటీ మెంబర్లందరినీ ఫస్ట్ బాచ్‌గా తయారుచేసి సింగపూర్, మలేషియా పంపిస్తాను. ఆ తరువాత ఇతర దేశాలు– అలా జీవితాంతం రెండు మూడు నెలల గాప్‌లో ప్రపంచమంతా తిరిగిరావచ్చు. ఎలా వుంది మన స్కీం?" సగర్వంగా అడిగాడు.

అందరూ ఓసారి మొఖాలు చూసుకున్నారు.

"బాగానే వున్నట్లుంది! ఇంతకూ అసలా స్కీం నెంబర్ త్రీ అంటే ఏమిటి?" గొణిగాడు శాయిరాం.

"వస్తున్నా! మీ ఎనిమిది మందిలో ఎవరికయినా లలితకళలలో ప్రవేశం ఉందా?"

"అలాంటిదేమీ లేదు"

అతని మొఖంలో కోపం కనిపించింది.

"లేకుండా ఎలా ఉంటుందండీ! మనిషన్నాక ఏదొక కళలో అభిరుచి ఉండాలి– ఉ

ంటుంది! కనీసం కాలేజీలో చదువుకునే రోజుల్లోనయినా 'హాబీ' లాంటిదేదయినా ఉండాలిగా"

"ఓ! ఆదా! అలా అయితే ఉన్నాయండీ! నాకు చిన్నప్పుడు డ్రాయింగ్ అంటే చాలా ఇష్టంగా ఉండేది. తెలుగు వాచకంలో తాబేలు బొమ్మను చూసి అచ్చం అలాగే డ్రాయింగ్ బుక్‌లో దించేసరికి మా డ్రాయింగ్ టీచర్ దంగైపోయాడు. నూటికి తొంభయ్ మార్కులు వేసేశాడు" ఆనందంగా చెప్పాడు శాయిరాం.

"నేను ఇంటర్ చదివేప్పుడు లలిత సంగీత పోటీలు జరిగాయ్. అందులో "రాయబారం చేయవే తడికో తడికా" అనే పాట పాడాను. బహుమతేమీ రాలేదు గానీ అందరూ భలే మెచ్చుకున్నారు" చెప్పాడు రంగారెడ్డి.

"నేను స్టేజ్‌మీద మంచిగ యాక్షన్ జెయ్యాలని జబర్దస్త్ ఖాయిషుండెనన్నా! ఎవ్వళ్ళూ చాన్స్‌గిట్ల ఇవ్వలేగానీ ఇప్పటి గ్గూడ యాక్షన్ చెయ్యాల్ననే ఉన్నది. జనార్ధన్ అన్నతో– సినిమాలో చిన్న వేషం వేసినా గానీ అది ఎడిటింగ్‌లో కట్‌జేసేసిన్రు బాడుకవ్‌లు" చెప్పాడు యాదగిరి.

"నా సంగతి మీకు ఇదివరకే తెలిసి ఉంటుంది" అన్నాడు జనార్ధన్ క్రాఫ్ సర్దుకుంటూ బ్రోకర్‌తో.

"నాకేమీ తెలీదే?" ఆశ్చర్యంగా అన్నాడు బ్రోకర్.

"జనార్ధన్ హెయిర్‌స్టయిల్ ఇంకోసారి సర్దుకుని "ఇప్పుడు చూడండి! గుర్తుపట్టారా?"

"నాకేం అర్థం కావటం లేదు. సంగతేమిటో త్వరగా చెప్పండి" చిరాగ్గా అన్నాడు బ్రోకర్.

"నేను కొన్ని సినిమాల్లో హీరోగా చేశానండీ"

"అలాగా?"

"మీరు సినిమాలు చూడరా?"

"ఒక్క సినిమా కూడా వదలకుండా చూస్తాను. మీరెందులోనూ కనిపించినట్లు గుర్తులేదే! ఒకే ఒక్క సినిమా మాత్రం మిస్సయ్యాను. ఎందుకంటే ఫస్ట్‌డే మాట్నీకి రిజర్వ్ చేసుకున్నాను. ఆ నాకొడుకులేమో మాణింగ్‌షోతో సినిమా ఎత్తేశారు" చిరాగ్గా అన్నాడు బ్రోకర్.

"ఆ! అదే! అదే నేను జనార్ధనన్నా యాక్ట్ చేసిన పిక్చరు" సంబరంగా అన్నాడు యాదగిరి.

"మిగతా సినిమాలు ఇంకా రిలీజ్ కాలేదు" అన్నాడు జనార్ధన్.

"మీ సంగతేమిటి గోపాల్రావ్ గారూ? మా హాబీ ఏమిటి?"

"ఏమీలేదే" ఆలోచిస్తూ అన్నాడు గోపాల్రావ్.

'లేకపోవటమేమిటి? ఏదో ఉండే ఉంటుంది! సరిగ్గా గుర్తు తెచ్చుకోండి"

గోపాల్రావ్ రెండు నిముషాలు ఆలోచించాడు.

"ఆ! గుర్తుకొచ్చింది! టెన్త్ చదివేప్పుడు మా ఇంటి వెనుక గడ్డివాము దగ్గర చుట్టుపక్కల పిల్లలందరినీ కూర్చోబెట్టి మాజిక్‌షో ఇచ్చాను. మాజిక్ అంటే చాలా ఇష్టం నాకప్పుడు."

అందరం ఆశ్చర్యంగా చూశాం గోపాల్రావ్ వేపు.

"అయితే నీకు మాజిక్ వచ్చా? మాకెవరికీ చెప్పలేదేం మరి?" ఆశ్చర్యంగా అడిగాడు శాయిరాం.

"ఏడ్చినట్లుంది. ఆ రోజు నేను చేసిన ఒకే ఒక్క అయిటం కాస్తా ఫెయిలయింది. గుప్పిటలో పావలా కాయిన్ చూపించి కాసేపు చేయి గాలిలో తిప్పితే అర్ధరూపాయి కాయిన్‌గా అయిపోవాలది. వాళ్ళందరూ నా చేతివేపు చూస్తూండడంతో కాయిన్ మారుస్తున్నప్పుడు దొరికిపోయాను"

"మరి మీ హాబీ ఏమిటమ్మా?" రాజేశ్వరిని చూస్తూ అడిగాడతను.

"నేను డిటెక్టివ్ రైటర్ని"

"ఒడర్‌ఫుల్! ఎన్ని బుక్స్ రాశారు మీరు?"

"పదహారు నవలలు రాశాను గానీ ఒకే ఒక్కటి పబ్లిషయింది."

"ఏం ఫరవాలేదు. అది చాలు దున్నేయటానికి! మీ సంగతేమిటమ్మా?" పార్వతీదేవి నడిగాడతను.

"నాకు ముగ్గలేయటం హాబీ అండీ ఇంకేమీ రాదు."

"సూపర్బ్! అది చాలు!"

"కానీ ఇవన్నీ ఎందుకసలు?" అడిగాడు శాయిరాం.

"ఎందుకేమిటయ్యా? ప్రవాసాంధ్ర అసోసియేషన్‌లు మీకోసం అంతంత డబ్బు ఎందుకు ఇస్తున్నాయనుకున్నారు?" అడిగాడు బ్రోకరు.

"ఖచ్చితమయిన కారణం ఫలానా అని మాకు తెలీదుగానండీ, తెలుగు ప్రజల మీద ప్రేమతో జనాభా అందరినీ బాచ్‌ల వారీగా వాళ్ళ దేశాలు పిలిపించుకుని చూద్దామని అలా చేస్తున్నారని అనుమానమండీ"

బ్రోకర్ మతిపోయినట్లు చూశాడు.

"ఇదిగో మీ అనుమానం సంగతేమో గానీ మా మాటలు వింటే నాకు మతిపోయేట్లుంది! అసలు సంగతేమిటో తెలుసా? పాపం ఆ విదేశాల్లో తెలుగు వాళ్ళు తెలుగు ప్రజలకూ, తెలుగు కళలకూ, తెలుగు సంస్కృతికీ దూరంగా ఉ ంటున్నారు కదా! అందుకని అన్ని రంగాల్లోనూ నిష్ణాతులయిన తెలుగు ప్రముఖులను వాళ్ళ దగ్గరకు పిలిపించుకుని వారి ప్రతిభను స్వయంగా తిలకించి ఆనందించాలని

కోరిక! అందుకని అప్పుడప్పుడూ బోలెడు డబ్బు ఖర్చుచేసి ఇలా వివిధ కళల్లో ప్రావీణ్యం గల వారిని పిలిచేస్తుంటారు. ఇప్పుడర్థమయిందా?"

మాకెవరికి కొద్దిసేపటివరకూ నోట మాట రాలేదు.

చివరకు రంగారెడ్డి కోలుకుని మాట్లాడాడు.

"మరి కళల్లో ప్రావీణ్యత గలవారు కావాలంటే మమ్మల్ని సెలక్ట్ చేశారేమిటి మీరు?"

"ఇదిగో మిమ్మల్ని మీరలా కించపరచుకోకండయ్యా! ఒకాయనకు ఆరోక్లాస్ చదువుతున్నప్పుడు డ్రాయింగులో తాబేలు బొమ్మకు తొంభయ్ మార్కులొచ్చాయ్! అలా అలా ఆయన ఇప్పుడు ఆంధ్రదేశంలోని చిత్రకారుల్లో ప్రముఖుడయ్యాడు."

శాయిరామ్ కంగారుపడ్డాడు.

"అదేమిటి? ఆ తర్వాత మళ్ళీ ఇంతవరకూ బొమ్మే వేయలేదు. ఓసారి మళ్ళీ తాబేలు గీయబోయాను గాని అది ఎలుకలాగా కనిపించేసరికి మానుకున్నాను. మరి నేను ఆంధ్రదేశంలో ప్రముఖ చిత్రకారుడినని ఎలా చెప్తాము."

"అబ్బా! నిజంగా నువు ప్రముఖ చిత్రకారుడివి అవ్వక్కర్లేదయ్యా! ఆ పేరుతో వెళ్తావ్ అంతవరకే."

"కానీ తీరా అక్కడికెళ్ళాక నేను కాకిబొమ్మ కూడా గీయలేనని తెలుస్తే."

"చట్! ఊరుకోవయ్యా! వెధవనుమానాలూ నువ్వూనూ! పాపం వాళ్ళసలే ప్రవాసాంధ్రులు! ఇక్కడ ఎవడు గొప్ప చిత్రకారుడో, ఎవతె అద్భుతమయిన నాట్యగత్తో, ఎవడు సంగీత విద్వాంసుడో, ఎవడు ఉత్తమ నటుడో అవేమీ వారికి కొంచెం కూడా తెలీదు.

నేను ఎవడి గురించి ఏం ఇంట్రడక్షన్ ఇస్తే అదే వేదవాక్కు వాళ్ళకు! పాపం అప్పుడప్పుడూ వాళ్ళను చూస్తే నాకు జాలిగా కూడా ఉంటుందనుకో! ఎందుకంటే అమెరికాలాంటి దేశంలోనే ఎంతో పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్న మన తెలుగు డాక్టర్లు, ఇంజనీర్లు, వ్యాపారస్తులు, ఇంకా అనేక ఇతరవృత్తుల వాళ్ళను నేను ఇట్టే బోల్తా కొట్టిస్తున్నానే అని గిల్టీగా కూడా ఉంటుంది. కానీ ఏం చేస్తాం? తప్పదు!బిజినెస్ ఈజ బిజినెస్! వ్యాపారం అన్నాక మోసం తప్పదు కదా? ఏమంటారు?" వేదాంత ధోరణిలో అన్నాడు.

"అవునవును" వప్పుకున్నాడు జనార్ధన్.

"ఆ! ఎందాకా వచ్చాం! తాబేలు బొమ్మ వేసినవాడిని ప్రస్తుతం ఆంధ్రదేశంలో ప్రముఖ చిత్రకారుడు అంటాం. ఇకపోతే, కాలేజ్ సంగీత పోటీల్లో "రాయబారం చేయవే తడికో తడికా" అని పాటపాడిన వాడెవడు?"

"నేను" అన్నాడు రంగారెడ్డి.

"ఆ! చూడు బ్రదర్! నువ్వు ప్రస్తుతం రేడియోలోనూ, టీవీలోనూ తెలుగుదేశాన్ని

ఊపేస్తోన్న మధుర ఏకైక గాయకుడివి! నీకు తెలుగు ప్రజలంతా కలసి "గాన రాక్షస" అనే బిరుదు ఇచ్చారు."

రంగారెడ్డి భయపడిపోయాడు.

"అయ్యా నా వల్ల కాద్సార్! నన్నక్కడ స్టేజి ఎక్కించి పాడమంటే నా గతేంకాను? అతను చిరాకుపడ్డాడు.

"వినేది ప్రవాసాంధ్రులయితే మధ్యలో నీకు భయమెందుకయ్యా? వాళ్ళ చావు వాళ్ళు ఛస్తారు! నువ్వు నీకిష్టమొచ్చిన పాటలు ఓ అరడజను నేర్చుకుని పాడెయ్! కావాలంటే రేపట్నుంచే ప్రాక్టీస్ ప్రారంభించు. తరువాత జనార్దన్ గారెలాగూ సినిమా నటుడు. ఆయన నటించిన చిత్రాల్లో కొన్ని దృశ్యాలు ప్రవాసాంధ్రులకు స్టేజిమీద ప్రదర్శిస్తారు. ఇకపోతే యాదగిరి! ఇద్దరూ కూడా సినిమా నటులే కానీ ఒకే బాచ్‌లో వుండటం బాగుండదు. అందుకు మీరు సినిమా డైరెక్టర్‌నని చెప్పండి!"

యాదగిరి మొఖంలో ఆనందం కనిపించింది.

"అంటే అక్కడేం చేయాలి నేను?"

"ఏముందీ? స్టేజి ఎక్కిస్తారు వాళ్ళు. అక్కడ మీరు తీసిన సినిమా అనుభవాలు-అంటే ఏవో కొన్ని అబద్ధాలు కల్పించి చెప్తారన్న మాట సరేనా?"

"ఓ! అలాంటి మిమిక్రీ మనకు కొట్టినపిండి!" ఉత్సాహంగా అన్నాడతను.

"ఇక గోపాల్రావు సంగతి సరేసరి! మాజిక్ ప్రదర్శన ఓ అరగంట సేపు ఇచ్చేయవచ్చు" గోపాల్రావు అదిరిపడ్డాడు.

"ఏమిటి? నేను మాజిక్ చెయ్యాలా? నా వల్ల కాదండి! నేను అమెరికా వెళ్ళనసలు"

బ్రోకర్ నవ్వాడు.

"అరె! ఇంత పిరికివాళ్లేమిటండీ బాబూ ఈ కాలనీలో! అరగంట సేపు మాజిక్ చేయమంటే పారిపోతాడేమిటాయన?"

"ఎలా చేస్తానండీ! నాకసలేమీ రాదని చెప్పాను కదా?"

"వస్తే నిన్నెందుకు పంపిస్తామయ్యా మేము? భలేగున్నావే! మనమేం ప్రవాసాంధ్రుల కోసమే బ్రతుకుతున్నట్లు మాట్లాడతావేమిటి? వాళ్ళ అమాకత్వాన్ని నేను కాష్ చేసుకుంటాను. మీరేమో విదేశాలు వాళ్ళ ఖర్చు మీద చూడడం ద్వారా మీ సరదాలు తీర్చుకుంటున్నారు. అంతే! అంచేత వారం రోజుల్లో మాజిక్ నేర్చుకోవటం ఎలా అనే పుస్తకం కొనుక్కో! లేదా మన ఫేమస్ మెజీషియన్ షాడో దగ్గరకెళ్ళి షార్ట్‌టరం కోర్స్ నేర్చుకో! అయిందా? ఇంక పార్వతీదేవి గారూ! మీకు ముగ్గువేయటం హాబీ అన్నారు కదూ! మీరో పని చేయండి! ఓ అరగంట భరతనాట్యం చేయండి! మిమ్మల్ని ప్రఖ్యాత భరతనాట్య ప్రవీణురాలు శ్రీమతి పార్వతీదేవి అని వాళ్ళకు పరిచయం చేస్తాం."

పార్వతీదేవి విరగబడి నవ్వేసింది.

"బాగుందండీ జోకు"

బ్రోకర్ తృళ్ళిపడ్డాడు.

"జోకా? జోకేమిటండీ! నాకు జోకులేసుకుంటూ తిరగటమే పనునుకున్నారేమిటి?" అన్నాడు కోపంగా.

"అంటే? నిజంగానే నన్ను భరతనాట్య ప్రదర్శన ఇమ్మంటున్నారా?" నమ్మలేనట్లు అడిగిందామె.

"అవునమ్మా! నిజంగానే ఇవ్వాలి!"

"మీకు పిచ్చేమయినా ఎక్కిందా ఏమిటి? నాకసలు సరిగ్గా నడవడం కూడా రాదని మావారు ఆటలు పట్టిస్తుంటారు. మీరేమో..."

"అబ్బా- మీరేం డాన్స్ పోటీలకెళ్తున్నారా? ప్రవాసాంధ్రుల కిచ్చే డాన్స్ ప్రోగ్రాంకి కూడా డాన్స్ చేయటం రావాలా ఏమిటి? మీరలాంటి పిచ్చి పిచ్చి ఆలోచన్లేమీ పెట్టుకోకండి! పోనీ వాళ్ళు తప్పట్లు కొట్టాలని అంతగా కోరికగా వుంటే మూర్ఛ వచ్చినవాడినెవ్వర్నయినా జాగ్రత్తగా అబ్జర్వ్ చేయండి! ఆ రకంగా కాళ్ళూ చేతులూ కొట్టుకుంటే చాలు! కొంచెం కాలు బెణికిందనీ అంచేత నృత్యం అనుక్నుంత అద్భుతంగా చేయలేకపోయాననీ ఓ మాట చెప్పేస్తే సంతోషపడిపోతారు వాళ్ళు. చాలా అల్ప సంతోషులు పాపం వాళ్ళు."

పార్వతీదేవి నోట మాట రావటం లేదు.

"ఇంక నువ్వమ్మా రాజేశ్వరీ! నువ్వు డిటెక్టివ్ నవలలు రాస్తానన్నావు కదూ! డిటెక్టివ్ అన్న ముక్క వదిలేసి ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌ని ఉర్రూతలూగిస్తోన్న ప్రఖ్యాత రచయిత్రి రాజేశ్వరి అని పరిచయం చేద్దాం! మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే నువు రాసిన కొన్ని ఇటీవలి నవలలు గురించి ఓ రిపోర్ట్ తయారుచేసి చదవటమే"

"ఓ! బ్రహ్మాండంగా చదివేస్తా" ఉత్సాహంగా అందామె.

"అంతేకాదు! కేవలం రచయిత్రి అయినంత మాత్రాన వాళ్ళకు అంత థ్రిల్ వుండదు కనుక మీరు క్లాసికల్ సింగర్ అని కూడా ప్రచారం చేస్తాం. మీరు ఓ అరగంట క్లాసికల్ మ్యూజిక్ ప్రోగ్రాం ఇస్తే సరిపోతుంది. అది నాకు రాదు కదా అని అడక్కండి! బోలెడు టైముంది మీకు నేర్చుకోటానికి! నెల రోజుల వ్యవధి అంటే మాటలా?"

"అవును! పైగా గొంతు బాగోలేదని చెప్పి ఇష్టం వచ్చినట్టు పాడినా ఎవరూ ఏమీ చేయలేరు! కదూ?" మరింత ఉత్సాహంగా అందామె.

మా అందరి దగ్గరా తలో వందరూపాయలు తీసుకుని లేచి నిలబడ్డాడు బ్రోకరు.

"చూడండి! ఎవరు ఏ ఏ కళల్లో ప్రవీణులో ముందే చెప్పేశాను. తరువాత మళ్ళీ కన్‌ఫ్యూజ్ అయి నన్ను కన్‌ఫ్యూజ్ చేయకండి! నేను మళ్ళీ ఎల్లుండి మీ కాలనీ కొస్తాను. ఆ రోజు మీ అందరూ తలో మూడువేలూ అర్జెంటుగా ఎలా సంపాదించాలో అయిడియా

ఇస్తాను. అంటే స్కీం నెంబర్ త్రీ అన్నమాట! వస్తా"

అతను వెళ్ళిపోయాడు.

లోలోపల కొంచెం భయంగా ఉన్నా ఎంతో ఆనందంగా కూడా ఉంది మా అందరికీ. ఆ రెండు రోజులూ మాకు ఒకటే కలలు – అప్పుడే అమెరికా వెళ్ళిపోయినట్లూ– మాకు ఘనస్వాగతం లభించినట్లూ–

రెండోరోజు రాత్రయితే రంగారెడ్డి గావుకేకలేసుకుంటూ ఇంట్లో నుంచి బయటకు పరుగెత్తుకొచ్చాడు. వాళ్ళ ఆవిడ, పిల్లలు సమయానికి మేలుకుని గట్టిగా అరవబట్టి అందరం లేచి అతన్ని గట్టిగా పట్టుకున్నాం.

"హా! అమెరికా! అదుగో స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ– ఇదిగో యు.ఎన్.ఓ. అదిగో వైట్‌హౌస్, అదిగో వాటర్‌గేట్" అంటూ ఇంకా అరుస్తూనే ఉన్నాడతను. అతని కళ్ళు మాత్రం మూసుకుని ఉన్నందువల్ల ఇంకా నిద్రావస్థలోనే ఉన్నాడని అర్థమయింది మాకు.

ఈలోగా ఎవరో గ్లాసు నిండా చల్లని నీళ్ళు తెచ్చి అతని మొఖం మీద కొట్టారు.

కెవ్వున కేకవేసి కళ్ళు తెరిచాడు. ఆ కేకు అందరం అదిరిపడ్డాం.

"ఏమిటి? ఎందుకలా అరచావ్?" అడిగాను.

"ఫ్లైట్ క్రాష్! మనాళ్లందరూ క్షేమమేనా?" అయోమయంగా అందరి మొఖాల్లోకి చూస్తూ అడిగాడు.

అందరూ ఘొల్లుమని నవ్వారు.

దాంతో మరింత స్పృహ తెచ్చుకుని చుట్టూ చూసి "మనం ఎందుకున్నాం ఇక్కడ?" అన్నాడు.

అందరూ మళ్ళీ నవ్వారు.

"పదండి! ఇంట్లోకెళదాం! ఈ మాయదారి అమెరికా టూరేమో గానీ ఈ మనిషి రెండ్రోజుల్లో పిచ్చాడిలా అయిపోయారు!" అంటూ రెడ్డిని లోపలకు తీసుకుపోయిందతని భార్య.

మర్నాడు ఉదయం ఏడుగంటలకే అందరం రెడీ అయిపోయి చక్రధర్ కోసం ఎదరుచూస్తూ కూర్చున్నాము.

మరికాసేపట్లో అతని కారు రానే వచ్చింది.

అందరం అతని చుట్టూ మూగిపోయాం నమస్కారాలు పెడుతూ. చిరునవ్వుతో నమస్కారాలందుకుని సిగరెట్ వెలిగించుకుని, కారు దిగి ఆనుకుని నిలబడ్డాడతను.

"మీ లిస్ట్ ఫైనలైజ్ అయిపోయింది. ఇంక మీరు తలో మూడువేలూ సంపాదించటమే ఆలస్యం" అన్నాడు.

"అదేనండీ! అది సంపాదించటానికే స్కీమ్ నెంబర్ త్రీ అని ఏదో సీక్రెట్

చెపుతానన్నారివాళ."

"కూర్చోండి!" అన్నాడతను ఓ క్షణం ఆగి.

అందరం నేలమీదే చతికిలబడ్డాం.

"ముందు మీరేం చేయాలంటే ఏదొక సాంస్కృతిక ప్రదర్శన ఏర్పాటు చేయాలి మీ కాలనీలో. ప్రముఖ పారిశ్రామికవేత్తలనూ, పోలీస్ మరియు ఇతర ఉన్నాతాధి కారులనూ కొంతమందిని ఎన్నుకుని వాళ్ళను ఆ కార్యక్రమంలో స్టేజి ఎక్కించాలి. మైక్ దగ్గరకు మీ కాలనీ కల్చరల్ గ్రూప్ వాళ్ళను వరుసగా పిలిపించి వాళ్ళందరినీ పేరుపేరుగా పొగిడించాలి. వాళ్ళను స్తుతిస్తూ పాటలూ, పద్యాలూ పాడించాలి. వాళ్ళు మైక్ ముందు నిలబడిన దగ్గర్నుంచీ ఉపన్యాసం అయ్యేవరకూ తప్పట్లు కొట్టాలి. వాళ్ళు స్టేజ్ మీద కొంచెం కదిలితే చాలు కలర్ ఫోటోలు తీయాలి. వీడియో తీయాలి. ఫొటోలు అన్ని పేపర్లలోనూ, మ్యాగజైన్లోనూ, టీవీలోనూ, వేయించాలి. ఎలావుంది "స్కీమ్ నెంబర్ త్రీ" ఉత్సాహంగా అడిగాడతను.

అందరం మొఖాలు చూసుకున్నాం.

"ఇందులో పెద్ద యిదేముందనీ! మేము ఇదివరకు రెండుమూడు సన్మానాలు చేసి ఆర్థికంగా చావుదెబ్బ తిన్నాం" అన్నాడు రంగారెడ్డి నిరుత్సాహంగా.

అతను ఓ క్షణం ఆలోచనలో పడ్డాడు.

"ఆర్థికంగా చావుదెబ్బ తిన్నారా! ఎలాగబ్బా! ఇంతవరకూ వీటిల్లో లాభమే గానీ నష్టం ఎక్కడా లేదే. ఆ ! గుర్తుకొచ్చింది అయామ్ సారీ! స్కీమ్ నెంబర్ త్రీలో మీకు అసలయిన విషయం చెప్పలేదు"

"ఏమిటది?"

"అదే సావనీర్? మీ కాలనీ తరపున అమెరికా వెళుతున్న వారిని అభినందిస్తూ అభినందన సంచిక ఒకటి రిలీజ్ చేయాలి"

"ఏడ్చినట్లుంది! ఈ ప్రోగ్రామ్కే డబ్బుల్లేవని ఛస్తూంటే మధ్యలో ఈ అభినందన సంచికలేమిటి? మా చెవుల్లో పూలు ఏమయినా కనిపిస్తున్నాయా?"

అతను కొంచెం విసుగు కనబరిచాడు.

"ఇదిగో మీకే తెలిపోతే నేను చెప్పినట్లు వినాలి. మిమ్మల్ని టూర్ పంపించేవాడిని నేనా? మీరా?" కోపంగా అడిగాడు.

"మీరే- మీరే- మీరే" గాబరాగా అరిచారందరూ.

"అయితే మరి మీరెందుకు? పెద్ద బిజినెస్మెన్ లాగా పిచ్చివాగుడు వాగుతారు? నాకు వళ్ళు మండిందంటే అసలు మీ టూర్ కాన్సిల్ చేసి పారేస్తాను-"

అందరం సైలంటయిపోయాం.

"ఆ అభినందన సంచిక నేనే పబ్లిష్ చేస్తాను గనుక మీరు డబ్బు ఖర్చు పెట్టాల్సిన

అవసరం లేదు."

అతని మాట పూర్తవకుండానే అందరూ తప్పట్ల వర్షం కురిపించేశారు.

"చక్రధర్ జిందాబాద్– లాంగ్‌లివ్ చక్రధర్" అన్న కేకలు కూడా వినిపించినయ్.

"ఛఛ! మరీ ఇంత బేవార్స్ జనమేమిటయ్యా మీ కాలనీలో?" అంటూ మావేపు తిరిగాడతను చిరాగ్గా.

అంతవరకూ తప్పట్లు కొడుతున్న మేము ఠక్కున తప్పట్లు ఆపేశాము.

"అవునండీ! వట్టి లేకిజనం! మాకే చాలా సిగ్గుగా ఉంటుంది. వీళ్ళను తల్చుకుంటే! ఎదుటివాడి సొమ్ము అనగానే ఎక్కడలేని ఉత్సాహం పుట్టకొస్తుంది" అన్నాడు శాయిరామ్.

"అయితే మీ కాలనీవాళ్ళు చేయాల్సిన సహాయం ఒకటుంది. మీ కల్చరల్ ప్రోగ్రామ్ కొచ్చే ప్రముఖుల ఇన్‌ఫ్లుయెన్స్ ఉపయోగించి సావనీర్‌కి అడ్వర్టయిజ్‌మెంట్స్ తేవాలి! అంతే!"

"ఓశ్! ఇంతేనా! నో ప్రాబ్లెమ్" అన్నాడు రెడ్డి ఆనందంగా.

"అయితే ఇక్కడ ఇంకో తిరకాసుంది"

అందరం భయంగా, అనుమానంగా అతనివేపు చూశాము.

"అదేమిటంటే ఆ ప్రకటనలకొచ్చే డబ్బు మన అమెరికా టూర్‌కి ఏమాత్రం చాలదు.గనుక మిగతా డబ్బు కోసం స్కీమ్ నెంబర్ ఫోర్– ఫాలో అవాలి."

"స్కీమ్ నెంబర్ ఫోరా? అంటే ఏంటది?" అడిగాను.

"స్కీమ్ నెంబర్ త్రీ పూర్తయ్యాక చెప్తాన్లే"

"అసలిలా ఎన్ని స్కీమ్‌లున్నాయ్ ఇంకా?" చిరాకుగా అడిగాడు జనార్ధన్.

"ఎవరా ప్రశ్న అడిగింది? వాళ్ళ అమెరికా టూర్ కాన్సిల్ చేసి పారేస్తాను" అరిచాడతను.

జనార్ధన్ నిశ్శబ్దంగా ఉండిపోయాడు.

అతను కొంచెం శాంతించాడు.

"స్కీమ్ నెంబర్– ఫోర్ సాదారణంగా లాస్ట్ స్కీమ్ అవుతుంది! ఒకవేళ దానివల్ల కూడా రావలసినంత డబ్బు రాలకపోతే అప్పుడు స్కీమ్ నెంబర్ ఫైవ్ అమలుపరచాలి. సరే! మీ అందరికీ వారం రోజులు టైమిస్తున్నాను. ఈలోగా ఆ సాంస్కృతిక కార్యక్రమం తాలూకూ ఏర్పాట్లు, అభినందన సంచికకు కావలసిన వ్యాపార ప్రకటనలూ అన్నీ సిద్ధం చేయండి! సరేనా?" అంటూ టైమ్ చూసుకుని కెవ్వుమంటూ అరచాడు.

"కొంప మునిగింది? చిక్కడపల్లిలో సింగపూర్ వెళ్ళే కళాకారులను అరగంట క్రితమే సమావేశమవ్వమని చెప్పి వచ్చాను. వాళ్ళను ప్లేన్ ఎక్కించాలి" అంటూ కారువేపు పరుగెత్తాడు.

అందరూ వెళ్ళిపోయాక మా కమిటీవాళ్ళం మాత్రం మిగిలాము.

"ఇప్పుడు మన కల్చురల్ ప్రోగ్రామ్‌కి ఎవరెవర్ని పిలుద్దాం" అడిగాడు శాయిరామ్.

"మన జంటనగరాల్లో అన్ని ఫంక్షన్స్‌కి ముఖ్య అతిథిగా మోహన్‌రెడ్డి వస్తూంటాడు కదా– ఆయన్నే పిలుద్దాం!" అన్నాడు జనార్ధన్.

"అవును! ఏ సాంస్కృతిక సంస్థ అడిగినా పదివేల రూపాయలు ఠపీమని ఇచ్చేస్తాడట అతను" చెప్పాడు రంగారెడ్డి.

"మరి కాసేపటి తర్వాత డజను ప్రముఖ పారిశ్రామిక వేత్తలు, వ్యాపారస్తుల పేర్ల లిస్ట్ తయారుచేశాము.

ముందు మోహన్‌రెడ్డి ఇంటికెళ్ళాలని నిశ్చయించుకున్నాం.

ఉదయం ఏడుగంటలకే అందరం జూబిలీహిల్స్ బస్‌కోసం వెళ్లి నిలబడ్డాం. వరుసగా నాలుగు జూబిలీహిల్స్ బస్‌లు వెళ్ళాయ్‌గానీ, ఒక్కటీ మా స్టేజ్‌లో ఆగటం లేదు. పైగా జనం! బస్సులోపలా, ఫుట్‌బోర్డ్ మీదా, టాప్‌మీదా కూడా నిండిపోయి వేలాడుతున్నారు.

మాకు చాలా ఆశ్చర్యం కలిగింది.

ఆర్టీసీ బస్‌లు మన రాజధానిలో చాలా అధ్వాన్నం అన్న సంగతి తెలుసుగానీ ఇలా ఉదయం ఏడుగంటలక్కూడా ఇంత దారుణంగా కిక్కిరిసి పోతాయని తెలీదు.

ఇలా లాభం లేదని చివరకు రెండు ఆటోలను పిలిచాము.

"ఎక్కడికి వెళ్ళాలి సార్?" అడిగాడొక ఆటో అతను.

"జూబిలీహిల్స్ వెళ్ళాలి" కొంచెం స్టయిల్‌గా చెప్పాడు శాయీరామ్.

"మోహన్‌రెడ్డి గారింటికా సార్?" అడిగాడతను.

మాకు మతిపోయినట్లయింది.

"నీకెలా తెలుసు?" ఆశ్చర్యంగా అడిగాడు రంగారెడ్డి.

"సాధారణంగా జూబ్లీహిల్స్ అంటే అక్కడికే అని మాకు తెలుస్సార్"

ఆటోలు బయల్దేరినయ్.

"మీది ఏ కల్చురల్ ఆర్గనైజేషన్ సార్?" అడిగాడు ఆటోవాడు కాస్త దూరం వెళ్ళాక.

శాయీరామ్ ఆనందంతో పొంగిపోయాడు.

"నన్ను మైక్ ముందెప్పుడయినా చూశావా?"

"లేద్సార్"

"మరి మాది కల్చురల్ ఆర్గనైజేషన్ అని నీకెలా తెలుసు?"

"మోహన్ రెడ్డి గారి దగ్గరకు వెళుతున్నారంటే అనుమానం వచ్చింది సార్! ఆయనే కదండీ ఇలాంటివాటికి తెగ డబ్బిచ్చేది?"

మా మొఖాలు మాడిపోయాయ్.

"సరే సరేలే! త్వరగా పోనీ" అన్నాడు రంగారెడ్డి కోపం అణచుకుంటూ.

ఆటో జూబ్లీహిల్స్ మీద కొంతదూరం ఎక్కేసరికి ఆ ప్రాంతమంతా ట్రాఫిక్‌జామ్ అయిపోయి కనిపించింది.

ఆటోలూ, ఆర్టీసీబస్‌లూ, స్కూటర్లూ, సైకిళ్ళూ క్రిక్కిరిసిపోయి ఉన్నాయ్ రోడ్డంతా. పోలీస్ విజిల్స్ చెవులు పగిలేంత గట్టిగా వినబడుతున్నాయ్.

"ఏమిటింత ట్రాఫికిక్కడ?" రంగారెడ్డి నడిగాను.

"ఆ ఏదో జాతర జరుగుతూండి వుంటుంది. తెలుగు రాజధాని జాతరలకు ఫేమస్ కదా!" అన్నాడు రెడ్డి.

"ఈ ట్రాఫిక్ క్లియర్ అయేసిరికి మరో గంటయినా పడుతుంది. అంత వరకూ మీటరు తిరగటం ఎందుకు? దిగి నడిచి వెళ్దాం పదండి! మహా అయితే మరో అరకిలోమీటర్ దూరముంటుంది" అన్నాడు శాయీరామ్.

అందరం నడక ప్రారంభించాం.

ఆ జనంలోంచి తప్పించుకు నడవటం ప్రాణం మీద కొస్తోంది. చివరకు మోహన్‌రెడ్డి ఇంటికి వందమీటర్ల దూరంలో ఆగిపోక తప్పలేదు.

అక్కడ అడుగు తీసి అడుగు వేసేందుకు కూడా స్థలం లేదు. పోలీస్ కానిస్టేబుల్స్ లాఠీలు ఊపుతూ జనాన్ని చెదరగొడుతూ విజిల్స్ వేస్తున్నారు.

"ఏం జాతర ఇక్కడ?" అడిగాను ఓ కానిస్టేబుల్‌ని.

"జాతరేమిటి?" ఆశ్చర్యంగా అడిగాడతను.

"మరి ఈ జనమంతా ఏమిటి?"

అతను పగలబడి నవ్వాడు.

"నీ యవ్వ! మంచిగున్నావ్ భయ్! ఈ రోడ్ మీద రోజూ గిట్లనే జమవుతారు కొడుకులు! ప్రతి ఒక్కరికీ పుక్కట్ పైసలు గావాల! ఈ మోహన్‌రెడ్డి సాబ్ ఏమో ఏ కల్చరల్ అసోసియేషనోళ్ళు అడిగినా గానీ లేదనకుండ పైసిలిస్తడు. వాని సొమ్మేం బోయే గవర్నమెంట్‌ని ముంచి పైసల్ మస్త్ కమాయించుడు. స్టేజ్‌మీదా, న్యూస్‌పేపర్లల, టీవీల్ల కనబడాల్నని ఒకటే దూల! దాన్ని గురించి ప్రతోడూ గిట్లనే కల్చరల్ ఆర్గనైజేషన్ అని బోగస్‌దొకటి జమాయించి ఈ సాబ్ కాళ్ళ మీద పడుతున్రు! సస్తే సావనీ గానీ మధ్యల వీండ్ల తోటి ఈ రోడ్డంతా నిండిపోయి ట్రాఫిక్ జామ్ అయి మా డిపార్టుమెంట్‌కు పరేషాన్. ఇంతకూ మీరెందు కొచ్చిన్రీడకు! మోహన్‌రెడ్డి సాబ్ గురించేనా?"

మళ్ళీ అందరి మొఖాలూ జేవురించినయ్.

"ఛట్! ఆయనతోటి నాకేం పనివయ్యా! మేము ఈ రోడ్ అవతల దిక్కుకు పోవాలి!" అన్నాడు యాదగిరి ఛప్పున కల్పించుకుంటూ!

"గట్లనా! అయితే ఆగో– ఆ గల్లీ లేదా! అటుకెళ్ళి రౌండ్‌ఎబౌట్ రూట్‌లో పోండ్రి!

ఈ జనంలో కెళ్ళిపోయెడిదయితే చాలా కష్టం”

మేము ఆ కానిస్టేబుల్ దృష్టి నుంచి అతి చాకచక్యంగా తప్పించుకుని వెనక్కు వెళ్లాము.

“ఏయ్! అక్కడ నిలబడతావేమిటి! ఏదొక క్యూలో నిలబడండి గానీ అటూ ఇటూ కాకుండా నిలబడొద్దు” అరచాడు మా పక్కన నిలబడ్డ వ్యక్తి.

అప్పుడర్థమయింది మాకు అది ట్రాఫిక్ జామ్ కాదనీ, మోహన్‌రెడ్డి ఇచ్చే డబ్బు కోసం నాలుగు క్యూలు కట్టిన కల్చురల్ అసోసియేషన్‌ల నీనూ! పొద్దున్నే జూబ్లీహిల్స్ వెళ్ళే బస్‌లన్నీ అంత రష్‌గా ఎందుకుంటాయో అప్పుడు తెలిసింది.

మాట్లాడకుండా వెళ్ళి ఓ క్యూలో నిలబడ్డాము.

మోహన్‌రెడ్డిని కలుసుకునే అవకాశం దొరికే సరికి మధ్యాహ్నం పన్నెండయి పోయింది.

మమ్మల్ని చూడగానే అతని మొఖంలో చిరాకు కనిపించింది.

“ఏం కావాలా మీకు?”

“మాది నిర్భయ్‌నగర్‌కాలనీ కల్చురల్ అసోసియేషన్..”

అతను మేము చెప్పేది పూర్తిగా వినిపించుకోలేదు.

“మీకేమయినా చెముడుందా? మీకేం కావాలి అనడిగాను. సమాధానం చెప్పండి అంతే! డోంట్ వేస్ట్ మై టైమ్…”

“సంగతేమిటంటేనండీ మా కల్చురల్ ఫంక్షన్‌కి మీరు ముఖ్య అతిథిగా–”

మళ్ళీ మా డైలాగ్ సగంలోనే కట్ చేశాడు.

“ఎంత కావాలి?”

“పదివేలు” అన్నాడు రంగారెడ్డి ఠక్కున.

“కాదు–పదకొండు” అన్నాడు శాయిరామ్ రంగారెడ్డి వేపు కోపంగా చూస్తూ.

“నిజానికి పన్నెండువేలయితే బావుంటుంది. అన్నాడు గోపాల్రావు అద్భుతంగా చిరునవ్వు చిందిస్తూ.

“సావనీర్‌తో కూడా మిలాయాస్తే పదిహేనువేలిస్తే మంచిగుంటది సార్” ఫైనల్‌గా చెప్పాడు యాదగిరి.

అతనికి ఆ మాటలు వినిపించుకోలేదు.

“ఇగో! ఈ వందరూపాయలు తీసుకెళ్ళండి– నెక్ట్స్” అంటూ వందకాగితం రంగారెడ్డి చేతిలో పెట్టాడు.

మాకు మతిపోయినట్లయింది.

“అది కాద్సార్”

ఓ లావుపాటి వ్యక్తి వచ్చి మా ముందు నిలబడి "పదండ్రి బయటకు" అన్నాడు తీవ్రంగా చూస్తూ.

చేసేదిలేక బయటికొచ్చేశాము. "పోన్లే! ఆటో ఖర్చులకయినా వస్తుంది! అన్నాడు రంగారెడ్డి.

ఇంక అతనితో లాభం లేదని మా లిస్ట్‌లోని రెండోపేరు ఇంటికి చేరుకున్నాం. ఓ పదినిముషాలు వెయిట్ చేశాక ఓ లావుపాటి వ్యక్తి బయటికి వచ్చాడు. అతను హైద్రాబాద్‌లోని పెద్ద బిజినెస్ మాగ్నెట్!

"ఏం కావాలి?" చాలా సౌమ్యంగా అడిగాడతను.

సంగతంతా చెప్పాము.

"కనుక మా కార్యక్రమానికి మీరు ముఖ్య అతిథిగా రావాల్సార్" అన్నాడు శాయిరామ్.

"ఓ! అలాగే! కానీ నన్నే ఎందుకు ముఖ్య అతిథిగా ఆహ్వానిస్తున్నారో కొంచెం చెప్తారా." అడిగాడతను.

ఒకిరి ముఖాలొకరు చూసుకున్నాం. ఏం చెప్పాలో ఓ పట్టాన అర్థం కాలేదు.

మళ్ళీ యాదగిరే మమ్మల్ని కాపాడాడు.

"గట్లడుగుతే ఏం జెప్పాల్సార్? కళలంటే మీకు చాన ఇదున్నదని మేమందరం అనుకొన్నమన్నట్లు! మీరంటేమాకెంతో అభిమానం! మా కాలనీ ఓళ్ళందరూ గూడా మీరే ఉండాల్నని ఒకటే లొల్లి పెడుతుర్రు! దాన్ని గురించి"

"అదీగాక మిగతా వారందరిలా వ్యాపారమే ప్రధానం అనుకోకుండా కళలను ఆదరించాలనుకునే గొప్ప మనసు గలవారు మీరు" అన్నాడు శాయిరామ్ ఇంకొంచెం పొగుడుతూ.

"అసలు మీరే గొప్ప సాహితీకారులని కూడా మాకు తెలుసు. మీర్రాసిన "పురుషోత్తముని ప్రవచనాలు" అనే గేయకవితలు అద్భుతం! మా కాలనీలో చిన్న పిల్లలు కూడా అప్పజెప్పగలరు మొత్తం పుస్తకం" అన్నాడు రంగారెడ్డి.

పురుషోత్తంగారి మొఖంలో ఆనందం కనిపించింది.

"సరే! మీరింతగా అడుగుతున్నారు కాబట్టి వప్పుకుంటున్నాను" అన్నాడు చిరునవ్వుతో.

మా అందరి మొఖాలు విప్పారినయ్. స్కీమ్ నెంబర్ త్రీ తెగ సక్సెస్ అయిపోతుందన్న ఫీలింగ్ అందరికీ వచ్చేసింది.

"థాంక్యూ వెరీమచ్ సార్" అన్నాడు శాయిరామ్.

"అయితే మీతో ఒకమాట ముందే చెప్పాలను కుంటున్నాను" వెంటనే అన్నాడతను.

"ఏమిటండీ అది?"

"నేను ఒక్క పైసా కూడా ఇవ్వను! నన్నేమీ అడక్కండి!"

మా గుండెల్లో రాయిపడింది. అతికష్టం మీద కోలుకున్నాం– ఆ షాక్‌నుంచి. అయితే ఎవరి నోరూ పెగలటం లేదు.

"ఏమంటారు మరి? అయినా మీది అలాంటి కల్చరల్ ఆర్గనైజేషన్ కాదనే అనుకుంటున్నాను."

"అహో!" అన్నాడు శాయిరామ్ పొడిగా నవ్వుతూ.

"ఈహోహో" అన్నాడు రంగారెడ్డి వింతగా నవ్వుతూ.

"ఈహిహి" అన్నాడు యాదగిరి.

"అవున్సార్! మాది అలాంటి బేవార్స్ సంస్థకాదు. మేము ఛస్తే ఎవరిదగ్గరా డబ్బు తీసుకోము. అయితే ఇంతకుముందు భారీ ఎత్తున మేమే కండక్ట్ చేసిన కల్చరల్ ప్రోగ్రామ్స్ వల్ల కొంచెం ఇబ్బందిలో ఉండి కేవలం మీ ఒక్కరిదగ్గర మాత్రమే డొనేషన్ తీసుకుంటే తప్పులేదని మా కాలనీ ప్రెసిడెంట్ జనార్థన్ గారిని మేమంతా బ్రతిమాలుతున్నాం" అన్నాడు గోపాల్రావు కన్నుగీటుతూ.

"అవ్ జనార్థనన్నా? ఇయాళొక్కదినం పైసలు దీసుకో! మనం కాలనీ దిక్కువెళ్ళి జరా నీ ప్రిన్సిపుల్స్‌నీ పక్కకుబెట్టి ఖుర్బానీ గిట్టచెయ్" అన్డాఉ యాదగిరి.

"వద్దు బ్రదర్! మన కాలనీ కల్చరల్ కమిటీ మిగతా వాటిలాగా కాదు. ఎవరిదగ్గరా డొనేషన్స్ తీసుకోమని ప్రతిజ్ఞ చేశాను."

"పోనీలే గురూ! ఈ ఒక్కసారికీ తీసుకో! పురుషోత్తం గారేం పరాయివారు కాదుగా! కళలకు ఆయన పుట్టినిల్లు" అన్నాడు రంగారెడ్డి.

"ఇదిగో.. మీరు ఎన్నయినా చెప్పండి! నేను ఒక్క పైసా కూడా ఇవ్వటం లేదు. అందుకు ఇష్టమయితేనే వస్తా" కొంచెం కోపంగా అన్నాడతను.

"అలా అంటే ఎలాగండీ! మీరిస్తారన్న ఆశతోనే కదా ఈ కళామతల్లి జీవిస్తోంది?" అనానడు శాయరాం.

"నేనివ్వనంటే ఇవ్వను– ఇన్ని రోజులు పిచ్చాడినయి ఇచ్చాను. ఇంక ఛసేత ఇవ్వను."

"పోనీ పదివేలివ్వండి చాలు."

"పది పైసలు కూడా ఇవ్వను."

మాకేం చెయ్యాలో తెలీటం లేదు. అలా బ్రతిమాలటం అలవాటు లేకపోవటం వల్ల చాలా బాధగానూ, అసహ్యంగానూ అనిపిస్తోంది.

"అంతేనా?" చిరాకుగా అడిగాడు యాదగిరి.

"అంతే!" కటువుగా అన్నాడతను.

"ఛూ నీయవ్వ! కళంటే సమజ్‌గాని బేవకూఫ్ గాన్ని అడిగెడిది మనదే గలత్! ఛల్."– అన్నాడు యాదగిరి!

"ఏయ్! మాటలు తిన్నగా రానీ! మీలాంటి దగుల్బాజీ కల్చురల్ గాళ్ళను చాలామందిని చూశా."

మా అందరికీ తిక్కరేగిపోయిందా మాటతో.

"పోరా బాడుకవ్! పైసలు సంపాదించగానే సరికాదురా! నీయవ్వ! కొంచెం కళాపోషణ చెయ్యాలి" అన్నాడు రంగారెడ్డి.

"లేకపోతే నీకూ జంతువుకీ తేడా ఏముందిబే!"అన్నాడు శాయిరాం.

"ఇగో– నువురాసిన 'పురుషోత్తముని ప్రవచనాలు" ఎవడికి పైసలిచ్చి రాయించుకుని నీపేరు బెట్టినావో మా కందరికి మంచిగ తెల్సురా సాలే–"

మా గొడవ భరించలేక అతడు పిచ్చెక్కినట్లు ఎగురుతూ మమ్మల్ని బయటకు వెళ్ళమని అరవసాగాడు.

మేమందరం బయటికొచ్చేశాము. లిస్టులోని మిగతావాళ్ళ దగ్గరకు వెళ్ళాలా వద్దా అని చాలాసేపు తర్జనభర్జనలు పడ్డాకు చివరకు వెళ్ళటానికే నిశ్చయించుకున్నాం.

అయితే మిగతావాళ్ళ దగ్గర మాపని చాలా సులువుగానే జరిగిపోయింది. మేమడిగినంత ఇవ్వకపోయినా ఎంతో కొంత ఇవ్వటానికి వప్పుకున్నారు.

అయితే ఆ మొత్తమంతా కలిసినా పదివేలు దాటకపోవటంతో కథ మళ్లీ మొదటికొచ్చింది.

అందరం చక్రధర్‌ని కలుసుకున్నాం.

"ఈ డబ్బేం సరిపోతుంది? లాభం లేదు! వెంటనే స్కీం నెంబర్ ఫోర్ స్టార్ట్ చేయండి!" అన్నాడు చక్రధర్.

"అంటే ఏం చేయాలి?" అడిగాడు రంగారెడ్డి.

"ఛఛ! ఆ మాత్రం తెలీదా? మీ మొఖాలు చూస్తుంటే అసలు ఫారిన్‌టూర్ వెళ్ళిన వాడితో మాట్లాడే అవకాశం కూడా దొరకని గబ్బిలాయిల్లా కనబడుతున్నారు. స్కీమ్ నెంబర్ ఫోర్ అంటే తెలీకపోవటం ఏమిటోయ్? ఫారిన్‌టూర్‌కి మీకందరికీ ఖర్చులు పెట్టుకోటానికి స్పాన్సరర్స్ కావాలి! అంతే మిగతాదంతా వెరీ ఈజీ!"

అందరం మొఖాలు చూసుకున్నాం! ఎవరికీ ఆ 'స్పాన్సరింగ్" అనే పదం గురించి ఏమీ అర్థం అయినట్లు కనిపించలేదు.

"స్పాన్సరర్" అంటే ఏమిటి గురూజీ?" అడిగాడు శాయిరామ్.

చక్రవర్తి మండిపడిపోతూ చూశాడు మావేపు. నిజానికి అలా ముక్కూముఖం తెలీనివాడు ఆవిధంగా మా మీద స్వారీ చేస్తుంటే మేము ఎదురు తిరిగి "పోపోరా!

సాలే" అన్న రోజులు చాలా ఉన్నాయి.

అయినా ఇప్పుడు ఫారిన్ టూర్ మీద ఎట్రాక్షన్‌తో ఎదురు ఇరగలేక "హిహిహి" అంటూ నవ్వేసి మమ్మల్ని కానట్లు మరో వేపుకు చూడసాగాము.

"ఛఛ! స్పాన్సరింగ్ అంటే కూడా తెలీని వాళ్ళీ జంటనగరాల్లో ఉన్నారంటే నాకీ నగరం వదలివెళ్ళిపోబుద్ధి వేస్తోంది. ఏమిటోయ్ ఇది? మీరు న్యూస్ పేపర్లు చదవరా? టీవీ చూడరా?" కోపం అణచుకుంటూ అడిగాడతను.

"చూస్తామండీ! మహాభారత్, హిందీ సీరియల్సు, టీవీలో వచ్చే సినిమాలూ"

"మరవి చూస్తున్నప్పుడు "ఈ కార్యక్రమాన్ని సమర్పిస్తున్న వారు గోద్రెజ్" అన్న వ్యాపార ప్రకటనలు కనపించలేదూ?"

"కనిపిస్తాయ్"

"అదే స్పాన్సరింగ్ అంటే! మీ ఫారిన్ టూర్ తాలూకు ఖర్చంతా ఎవరితోనయినా స్పాన్సర్ చేయిస్తే- అంటే ఖర్చంతా ఆ స్పాన్సరర్సే పెట్టుకుంటారన్నమాట! అంటే మీరు వెళ్ళిన ప్రతిచోటా ఫలానవారి స్పాన్సర్ షిప్‌లో మేము ఈ దేశం మీద తిరుగుతున్నాం అని చెప్పుకోవాల్సి వస్తుంది. అంతే"

"కానీ మమ్మల్ని విదేశాలకు పంపించి మా ఖర్చంతా పెట్టుకోడానికి గోద్రెజ్ కంపెనీవాళ్లు పప్పుకుంటారా?" అనుమానంగా అడిగాడు శాయిరామ్.

అతను మళ్ళా మమ్మల్ని తినేసేట్లు చూశాడు.

"అబ్బా! మరీ ఇంత అధ్వాన్నపు మనుషులున్నారేమిటయ్యా ఈ కాలనీలో" అన్నాడు, జుట్టు సగం పీకి అవతల పారేస్తూ "గోద్రెజ్ అంటే నిజంగా గోద్రెజ్ వాళు ళ కాదయ్యా! అలా ఇంకెవరయినా మన జంట నగరాల్లో స్పాన్సర్ చేస్తారేమో ప్రయత్నించాలి! అర్ధమయిందా?"

"అయిందయింది?" అన్నాం అందరం ఆనందంగా.

"మరింక ఆ పని ప్రారంభించండి ఇవాళ్టినుంచే- ఎవడి చుట్టూ తిరుగుతారో, ఎవడిని ఎలా వల్లో వేసుకుంటారో తెలీదు. కానీ మీలో ప్రతిఒక్కరూ ఏదోకవ్యాపార సంస్థతో స్పాన్సర్ చేయించుకోవాలి! అంతే!"

అతను వెళ్ళిపోయాక మేమంతా వేదిక దగ్గర గుమికూడాము.

"ఇప్పుడు మనం అసలు స్పాన్సరర్స్ ఎంతమంది మన జంటనగరాల్లో వున్నారో కనుక్కోవాలి! వాళ్ళందరి లిస్టూ తయారుచేసుకుని వాళ్ళను కాకా పట్టాలి!" అన్నాడు జనార్ధన్.

"కానీ ఇలాంటి వాటిని ఎవరు స్పాన్సర్స్ చేస్తారో ఎలా తెలుస్తుంది?"

"ఇన్‌ఫర్మేషన్ సంపాదించాలి! మలక్‌పేటలో నాకు తెలిసిన ఫ్రెండొకడున్నాడు.

శ్రీరామనవమి పండగ టైమ్‌లో డ్రామా లేసేవాడు! వాడు ఇలాగే ఎవర్నో పట్టుకుని 'ఈ దశాబ్దపు ఉత్తమ నటుడు' అని బిరుదు తనే తగిలించుకుని అమెరికా వెళ్ళిపోయాడు. పదండి వాడి దగ్గర కెళ్దాం."

అందరం జనార్ధన్ ఫ్రెండ్, దశాబ్దపు ఉత్తమ నటుడూ అయిన "మహేష్ కుమార్" దగ్గరకెళ్ళాం.

అతను ఆఫీస్‌రూమ్‌లో కూర్చుని ఏదో సీరియస్‌గా రాస్తున్నాడు. మమ్మల్ని చూడగానే ఆనందంగా ఆహ్వానించాడు.

"ఏమిటి గురూ రాస్తున్నావ్?" అడిగాడు జనార్ధన్.

"సాంస్కృతిక బృందంతోపాటు, అమెరికా వెళ్ళివచ్చాను కదా! ఆ విశేషాలన్నీ "ఓ అమెరికా! మై తెలుగూ అమెరికా" అనే సీరియల్ రాస్తున్నాను మన వారపత్రికలో" ఆనందంగా అన్నాడతను.

"కానీ రాసింది వేయడానికి మన పత్రికలవాళ్ళు వప్పుకున్నారా?" అడిగాడు జనార్ధన్.

"ఆ పత్రికలో సాంస్కృతిక కరస్పాండెంట్ నాకు చాలా క్లోజ్ ఫ్రెండ్! ఇద్దరం చిన్నప్పట్నుంచీ బార్‌మేట్స్, అంతేగాకుండా ఇద్దరిది ఒకటే కాంపస్!"

"ఏ యూనివర్శిటీ కాంపస్?" ఆత్రుతగా అడిగాడు శాయిరామ్.

అతను మమ్మల్ని పిచ్చాళ్ళను చూసినట్లు చూశాడు.

"యూనివర్శిటీ కాంపస్ కాదోయ్! కల్లు కాంపౌండ్ కాంపస్! ఒకటి రెండేళ్ళు అందులోనే రోజూ తాగుతూ గడిపాం. వాడికేమీ అక్కర్లేదు. ఫారిన్ విస్కీగానీ బ్రాందీగానీ ఒక బాటిలిస్తే చాలు! వాళ్ళ దినపత్రిలో మన గురించి సంపాదకీయం రాయించేస్తాడు. అందుకని మొత్తం పదహారు బాటిల్స్‌కి బేరం కుదిరింది. అందుగ్గాను నేను రాస్తున్న సీరియల్ అంతా అమెరికాలో నేను దిగిన ఫొటోలతో సహా వేసేస్తున్నాడు. ఈవాళ వాడి న్యూస్ పేపర్ చూళ్ళేదా? డిస్నీలాండ్‌లో ఎవరూ చూడకుండా నేను యూరినల్స్‌కి వెళ్తోన్న ఫొటో వేశాడు" అంటూ లోపలికెళ్ళి దినపత్రిక తెచ్చి మాకిచ్చాడు.

"చాలా బాగుంది" అన్నాం మేము ముక్తకంఠంతో

"మరి మీరేమయినా పనిమీద వచ్చారా?" అడిగాడతను.

"అవును! గురూ!" అంటూ సంగతంతా చెప్పాడు జనార్ధన్.

అతను విరగబడి నవ్వాడు.

"నీయవ్వ! భలే పాగల్ గాళ్ళున్నారు మీరు! ఫలానా స్పాన్సరర్ అంటూ ఎవరూ ఉండరు. వరుసగా అన్ని కంపెనీలకూ వెళ్ళి అందరి కాళ్ళూ పట్టుకోవటమే! వెరీ ఈజీ!"

"ఆ! అంత తేలికా?"

"అవును! ఈ సారి మొత్తం ఫామిలీతో నేను అమెరికా వెళ్తున్నాను. మగాళ్ళ

అండర్‌వేర్స్ కంపెనీవాడు నా భార్యను స్పాన్సర్ చేస్తున్నాడు. బ్రాసియర్స్ కంపెనీవాడు నన్ను స్పాన్సర్ చేస్తున్నాడు. ఫామిలీ ప్లానింగ్ మెటీరియల్ తయారు చేసేవాడు మొత్తం మా ఎనిమిదిమంది పిల్లలనూ స్పాన్సర్ చేస్తున్నాడు. మీరు కూడా వెళ్ళి ఎవడి కాళ్ళయినా సరే పట్టుకోండి. వెరీ ఈజీ! అయిదు నిమిషాల్లో పనయిపోతోంది.”

అందరూ లేచి బయటికొచ్చాం.

“ముందు ఎవడి దగ్గర కెళ్దాం?” చౌరస్తా కొచ్చాక అడిగాడు రంగారెడ్డి.

“ఆ! అబిడ్స్‌లో జిప్స్ తయారుచేసే కంపెనీ ఒకటుంది. ఆ కంపెనీ ప్రొప్రయిటర్ ఇంటికెళ్దాం పదండి” అన్నాడు గోపాల్రావ్.

అందరం అడ్రస్ వెతుక్కుంటూ వెళ్ళేసరికి చీకటి పడిపోయింది. నౌకరు మమ్మల్ని హాల్లో కూర్చోపెట్టి లోపలికెళ్ళాడు. హాలంతా కలియ చూసేసరికి మా గుండెలు ఝల్లుమన్నాయ్. గోడల మీద వరుసగా తగిలించిన ఫోటోల్లో ఆ ప్రొప్రయిటర్ కాళ్ళమీద వాలిపోయిన జనం, మరికొన్ని ఫోటోల్లో ప్రొప్రైటర్ తాలూకు వట్టి కాళ్ళే కనబడుతున్నయ్. ఆ కాళ్ళ చుట్టూ మూగిన జనం–

“ఆ! ఎవరయ్యా మీరు?” అన్నాడో లావుపాటి ఆకారం బయటికొస్తూ.

“మేము నిర్భయ్‌నగర్ కాలనీ వాళ్ళం సార్! అమెరికాలో సాంస్కృతిక ప్రదర్శన లివ్వటానికి వెళుతున్నాం! అందుకని”

“ఓహొూ అలాగా! సరే” అంటూ ఎత్తుగా ఉన్న ఓ సింహాసనం లాంటి కుర్చీలో కూర్చుని కాళ్ళు మా ముందు పెట్టాడు.

“త్వరగా కానీండి” అన్నాడు చిరునవ్వుతో.

ఆయన మాటలు మాకేమీ అర్థం కాలేదు.

“ఏమిటి సార్ త్వరగా కానించేది?”

“అద్గదీ! అలా చెప్పండి? అందుకే అట్లా దేబి ముఖాల్లాగా కూర్చున్నారు! త్వరగా కాళ్ళ మీద పడండి! అవతల మా నౌఖరు ఫోటో తీయటానికి రెడీగా ఉన్నాడు”

మేము మళ్ళీ మొఖాలు చూసుకున్నాం.

“మాకు కాళ్ళమీద పడటాల్లాంటివి అలవాటు లేదండీ! అదీగాక ఆ కాళ్ళమీద పడే కల్చరు అంటే కొంచెం అసహ్యం కూడానూ!”

అతను ఆశ్చర్యపోయాడు.

“ఓర్ని– భలేగున్నారే! ఇలా కాళ్ళమీద పడడం అసహ్యమయితే ఇంకా మీరు రాజకీయాల్లో గానీ, ఇతరత్రా గానీ పైకెలా వస్తారండీ! మన భారతదేశ చరిత్రంతా చూడండోసారి! కాళ్ళ కల్చర్ పురాణ కాలం నుంచే అమల్లో ఉంది. రోజుకి కనీసం పాతిక జతల కాళ్ళమీద పడితేగానీ చాలా మందికి మనశ్శాంతి ఉండదు. పైగా ఈ

కల్చర్ మన తెలుగువాళ్ళలో మరీ ఎక్కువ.”

జనార్ధన్ కోపంలో ఉడికిపోగాడు.

“ఉహు! వీల్లేదుసార్! మా కాలనీలో చాలామందికి తినడానికి తిండి లేకపోయినా కొంచెం అభిమానం ఎక్కువ. కాళ్ళమీద పడటమా? హా! ఇంపాజిబుల్ సారీ– నెవర్! కాళ్ళమీద ఎప్పటికీ పడం సార్! అడుక్కుతినాల్సిన పరిస్థితి వచ్చినా సరే! కాళ్ళమీద మాత్రం పడం సార్! హు! నా కొడకా! నీ కాళ్ళమీద పడాల్రా? ఆ సీన్ నువ్వు ఫోటో కట్టించి హాల్లో తగలిస్తావా? బాస్టర్డ్.”

ఆ తరువాత ఏం జరిగిందో మాకు తెలీదు గానీ ముందే మేము ఏదో ఉపద్రవం జరగబోతోందని ఊహించి అమాంతం జనార్ధన్ మీద పడి కదలకుండా నొక్కి పట్టేసి బయటకు లాక్కెళ్ళిపోయాం.

అక్కడినుంచీ తిన్నగా బ్లేడ్స్ తయారుచేసే కంపెనీకి చేరుకున్నాం. దాని మేనేజింగ్ డైరెక్టర్ వెంటనే మమ్మల్ని లోపలకు ఆహ్వానించాడు. లోపల అప్పటికే ఆరు సోఫాల్లో జనం నిండిపోయి ఉన్నారు. మమ్మల్ని ఏడో సోఫాల్లో కూర్చోబెట్టారు. అప్పటికే ఓ గిరిజాల వ్యక్తితో మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతున్నాడు.

“నన్ను రాధా ఫిలిమ్స్ ప్రకాశరావు గారు స్పాన్సర్ చేస్తున్నారు సార్! నిన్నే నాలుగువేలు కాష్ కూడా ఇచ్చేశారు. కానీ ఇంతవరకూ మా ఆవిడను స్పాన్సర్ చేసేవారెవరూ దొరకలేద్సార్? దయచేసి మీరు స్పాన్సర్ చేస్తే.”

“ఎవరూ మీ ఆవిడ? పిలవండి.”

గిరిజాలవ్యక్తి పక్కకు తిరిగాడు.

“ఏయ్! ప్రియాంక! ఇట్రావే! అయ్యగారు నిన్ను స్పాన్సర్ చేస్తానంటున్నారు” ఉత్సాహంగా చెప్పాడతను.

ఓ మధ్య వయసు స్త్రీ లేచి వయ్యారంగా మేనేజింగ్ డైరెక్టర్ దగ్గరకు నడిచి నమస్కరించింది.

“నమస్తే” అన్నాడతను ఆమెను పై నుంచి కిందవరకూ చూస్తూ.

“ప్లీజ్! మీరే నన్ను స్పాన్సర్ చేయాలి. మిగతా ఏర్పాట్లన్నీ అయిపోయాయండీ” అందామె దిగులుగా.

“మిగతా ఏర్పాట్లంటే?”

“అదేసార్! నాక్కావలసిన చీరలు భవానీ ఎక్స్‌పోర్టు క్వాలిటీ శారీహౌస్ వాళ్ళు స్పాన్సర్ చేస్తున్నారు. నా కాస్మటిక్స్ మా ఇంటెదురుగా ఉన్న రాజ్‌పాన్, కిల్లీ అండ్ సోడా డబ్బా అతను స్పాన్సర్ చేశారు. నాకు అక్కడ కావలసిన పై ఖర్చులకు యాదగిరి చిట్‌ఫండ్స్ కంపెనీ వారు స్పాన్సర్ చేశారు. నా చెప్పులు మార్కెట్లో ఉన్న మంజులతా చెప్పుల

దుకాణం వాళ్ళు స్పాన్సర్ చేశారు."

ఎమ్.డి. ఆమె చేయి తన చేతుల్లోకి తీసుకుని నిమిరాడు.

"కావాలంటే మీ చేతిగాజులు నేను స్పాన్సర్ చేస్తాను" అన్నాడు జంకుగా.

"అవి మా ఇంటికొచ్చే గాజుల సాయిబు స్పాన్సర్ చేస్తున్నాడు సార్!"

మేనేజింగ్ డైరెక్టర్‌కేం చేయాలో తోచలేదు.

"కానీ మేము ఇప్పటికే ఎనిమిదిమంది పెళ్ళాల్ని, పద్నాలుగురు కూతుళ్ళనూ, పదహారుగురు చెల్లెళ్ళనూ స్పాన్సర్ చేశాం. మా ఫండ్స్ అన్నీ ఖర్చయిపోయాయ్ అంచేత..........."

ఆమె అతని చేతిని తన రెండు చేతుల్లోకి తీసుకుంది.

"అలా అనకండీ!" అంది దిగులుగా.

అతని చలించిపోయాడు.

"ఆల్ రైట్! నాకు ఎలాగూ వచ్చేవారం అమెరికాలో పనుంది. అప్పుడు నాతో మిమ్మల్ని స్వయంగా, సపరేట్‌గా తీసుకెళ్ళి స్పాన్సర్ చేస్తాను" అన్నాడు గత్యంతరం లేక.

"అయ్యో! మా వారు ఎల్లుండే వెళుతున్నారు కదా! ఆయనతో పాటు నేనూ వెళ్ళాలి కదా!"

ఆమె భర్త రక్కున ఆమె నోరు మూసేశాడు.

"అహహ! అదేం ప్రాబ్లెమ్ లేదులెండి. మీరు స్వయంగా వెంబడి తీసుకొచ్చి స్పాన్సర్ చేసి ఆ తరువాత మాకు అప్పజెప్తానంటే అంతకంటే మాక్కావలసిందే ముంది? అలాగే కానీండి సార్."

మాకింక అక్కడ ఉండబుద్ధి కాలేదు.

లేచి బయటకు వచ్చేశాము.

"ఏమిటి? ఎందుకు బయటికొచ్చేశారు?" ఆశ్చర్యంగా అడిగింది పార్వతీదేవి.

"ఇక్కడి పద్ధతులు ఏమీ బాగుండలేదు" అన్నాడు రంగారెడ్డి.

"అవును! స్పాన్సరింగ్ అంటే ఇంకేమిటో అనుకున్నాను" అన్నాడు శాయిరామ్.

"అదేమీ కుదరదు! యింతదూరం వచ్చి అడక్కుండా వెళ్ళటం ఏమిటి? పదండి! అడిగి, కాదంటే వెళ్ళిపోదాం" అందామె చిరుకోపంతో.

మళ్ళీ వెనక్కి తిరిగి లోపలికెళ్ళాం.

మరో అరగంట తర్వాత మాటర్న్ వచ్చింది.

"ఏమిటి సంగతి?" అడిగాడతను.

సంగతంతా చెప్పాడు రంగారెడ్డి.

"ఓ సారీ! మగాళ్ళను స్పాన్సర్ చేయడం మానేశాం! ఎందుకంటే 'మగకోటా'

అయిపోయింది. మీ ఆవిడను పంపించండి రేపు! ఓ సారి చూసుకుని మాకు సంతృప్తి కలిగితే అప్పుడు స్పాన్సర్ చేస్తాము."

"అయిడియా బానే ఉంది. కానీ మా ఆవిడ్లెవరూ రావటం లేదండీ"

అతను ఆశ్చర్యపోయాడు.

"అలాగా! మరి ఆ నీలం చీరావిడ ఎవరు?"

"ఆమె పార్వతీదేవండీ! మా కాలనీయే!"

"అయితే ఇంకేం! ఆమెను స్పాన్సర్ చేస్తాను కావాలంటే."

మా అందరి ముఖాలూ వాడిపోయినాయి గానీ పార్వతీదేవి మొఖం చేటంత అయిపోయింది.

"ఆ నిజంగా చేస్తారాండీ?" ఆనందంగా అడిగింది.

"అవునండీ! వచ్చే నెలలో నేను హాంకాంగ్ వెళుతున్నాను. కావాలంటే అక్కడికి స్పాన్సర్ చేస్తాను."

"మరి మిగతావాళ్ళు?"

"వన్ పర్సన్ కల్చురల్ ట్రూప్ కింద మీరొక్కరూ చాలండీ! ఇంకెవ్వరూ అక్కరలేదు!"

"అలాగే – అయితే సరే" మా వంక జాలిగా చూస్తూ అంది పార్వతీదేవి.

మేమందరం బయటకు వస్తోంటే పార్వతీదేవి కూడా రాబోయింది గానీ అతను ఆపేశాడు.

"ఉండండి! ఇవాళ సాయంత్రం మా క్లబ్‌లో మీకు భోజనం కూడా నేనే స్పాన్సర్ చేయిస్తాను"

పార్వతీదేవి కొంచెం భయపడింది.

"అలాగాండీ! సరే మా వారిని కూడా తీసుకొస్తాను! ఏ క్లబ్‌కి రమ్మంటారు?" గాబరాగా అడిగింది.

"మీవారెందుకండీ అనవసరంగా! ఆయనకెవరు స్పాన్సర్ చేస్తారు భోజనం?"

"నేను చేస్తానులెండి!" నవ్వుతూ అని బయటికి వచ్చేసింది.

ఆ రాత్రి మళ్ళీ కాలనీ సమావేశం జరిగింది.

అందరం ఫారిన్‌టూర్ గురించి డిస్కషన్స్ చేసుకున్నాం.

"మనకి ఇలాంటి బేవార్స్ స్పాన్సరింగులు పనికిరావు. కనుక మనం ఈ కార్యక్రమం విరమించుకుందాం" అన్నాడు రంగారెడ్డి.

ఎవ్వరూ మాట్లాడలేదు.

ప్రయాణ సన్నాహాలు ఇంతదూరంవచ్చాక కాన్సిల్ చేసుకోవాలంటే అందరికీ చాలా బాధగా ఉంది.

యాదగిరి అందరిలోకీ ఎక్కువ బాధపడటం చూసి మాకు ఆశ్చర్యం వేసింది.

"ఏమిటి సంగతి? ఇప్పుడు కాకపోతే ఇంకొకసారి వెళ్తాం! ఎందుకంత శాడ్ ఫీలింగ్?" అడిగాడు శాయిరామ్.

"అదికాదు! మనం అమెరికా వెళ్ళి రావటం తప్పదనుకుని ఓ పత్రికలో డబ్బుకట్టి అమెరికా వెళుతున్న యాదగిరికి మా శుభాకాంక్షలు ఇట్లు ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక సంస్థలు అన్న ప్రకటన వేయించే ఏర్పాట్లు చేసేశాను" అన్నాడు దిగాలుగా.

"నేనూ– ఈ టూర్‌ని నమ్ముకుని మా బంధువులందరికీ ఉత్తరాలు రాసేశాను" అన్నాడు శాయిరామ్.

"అయినా మనం విచారించాల్సిన పనిలేదు. మనందరికీ విదేశాలకెళ్ళే అవకాశం మరోటి వుంది!" అన్నాడు రంగారెడ్డి.

శాయిరామ్ మొఖంలోకి హటాత్తుగా కళ వచ్చేసింది.

"ఏమిటి గురూ అది?"

"అవే తెలుగు మహాసభలు! ఈ సంవత్సరం విదేశాలలో జరుగబోయే ప్రపంచ తెలుగు మహాసభలకు మనం గవర్నమెంట్ ఖర్చుమీద వెళ్ళొచ్చు. కొంచెం శ్రమపడినట్లయితే"

శాయిరామ్ మొఖంలో పూర్తి ఆనందం వచ్చేసింది.

"అవును గురూ! ఆ సంగతి మర్చేపోయాను. కానీ గవర్నమెంట్ మనల్ని ఎలా పంపిస్తుందంటావ్? 'క్లూ' లేమయినా ఉన్నాయా?"

"కిందటి ప్రపంచ తెలుగు మహాసభలకు వెళ్ళిన ప్రకాశరావ్ నాకు బెస్ట్ ఫ్రెండ్! వాడినడిగి ఇన్‌ఫర్మేషన్ తెస్తాను."

అందరూ తప్పట్లు కొట్టారు.

అప్పుడే టాక్సీ ఒకటి రివ్వున వచ్చి మా ముందు ఆగింది.

శ్యామ్ డోర్ తెరచుకుని దిగాడు.

"ఏంటి బ్రదర్స్! ఏదో మీటింగ్ జరుపుతున్నట్లున్నారే" అడిగాడు చిరునవ్వుతో.

అతనికి మా ఫారిన్‌టూర్ విఫలయత్నాల గురించి తెలీటం ఇష్టంలేక" ఏం లేదు ఊరికినే ఏదో ఊసుపోక" అన్నాం.

"అలాగా! సరే అయితే నాకు గుడ్‌లక్ చెప్పండి! నేను అమెరికా వెళ్తున్నాను"

అందరం నోళ్ళు వెళ్ళబెట్టేశాం.

ఎవరికీ నోట మాట పెగలటంలేదు.

"అ.. అ.. అమెరికా వెళుతున్నారా?"

"అవునోయ్"

"ఎలా వెళుతున్నావ్? అయ్ మీన్ ఎవరు స్పాన్సర్ చేస్తున్నారు?" ఆత్రుతగా అడిగాడు

శాయిరామ్.

"ఒకడు స్పాన్సర్ చేయాల్సిన ఖర్మ నాకేంటోయ్. ఇండో–అమెరికన్ కల్చురల్ ఎక్స్చేంజ్ కోటాలో నన్ను సెలక్ట్ చేసుకున్నారు అమెరికా ప్రభుత్వం వాళ్ళు."

మాకు మతిపోయినట్లయింది.

"అమెరికా ప్రభుత్వం వాళ్ళు మిమ్మల్ని ఇన్వైట్ చేశారా?"

"అవును"

"ఇన్ని కోట్లమంది భారతీయులుండగా మిమ్మల్నే ఎలా పిలిచారు?"

"అదంతా ట్రేడ్ సీక్రెట్!"

అందరం అతని చుట్టూ మూగిపోయాం.

"బాబ్బాబు? ఆ ట్రేడ్ సీక్రెట్ ఏమిటో చెప్పవూ?" శాయీరామ్ అడిగాడు.

"ఇంకెవరికీ చెప్పనని మాట ఇస్తే చెప్తాను"

అందరం పట్టు వేసుకున్నాం.

"మరేం లేదు! ఆ అమెరికన్ కల్చురల్ ఎక్స్చేంజ్ సెంటర్లో ఓ రచయిత్రి వుంది. ఆవిడ నవల నా పత్రికలో వేసుకుంటే నన్ను అమెరికా పంపిస్తానంది. అంతే!"

"మరి నీకు పత్రిక ఎక్కడుంది?" అదిరిపడుతూ అడిగాడు జనార్ధన్.

"ఈనెల నుంచే ఓ పత్రిక పెట్టాను. ఎన్నిలే! వెయ్యి కాపీలు అచ్చు వేయించాను. రచయిత్రికి పాతిక్కాపీలు పంపించి మిగతాది చెత్తకాగితాల షాపులో అమ్మించేస్తే సరి! ప్రాబ్లెమ్ తీరిపోతుంది. వస్తా ఫ్లైట్కి టైమయింది" అంటూ వెళ్ళిపోయాడతను. మేము చాలా సేపటివరకూ సామాజిక కోమాలో ఉండిపోయాం.